క్లుప్తంగా

ముసురుతో ఇక్కట్లు

వెదురుకుప్పం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తుపాను కారణంగా సోమవారం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇళ్లు దాటి బయటకు రాలేని పరిస్థితి. జోరువానతో పొలాల్లో వర్షపు నీరు నిలిచి, చెరువల్లోకి నీరు చేరుతోంది. వివిధ కంపెనీల్లో, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అరుణగిరిపై కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కార్తీక పూజలు నిర్వహించారు. మూడవ కార్తీక సోమవారం సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేపట్టారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్న దాత

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం పూజలు వైభవంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన దాత పీకే శ్రీనివాస్ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి గుణశేఖర్ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్నదానం చేయదలచిన భక్తులు ఆలయ అధికారులను సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత నారాయణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చీరాలకు చెందిన నంబూరు నారాయణ తన భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం రూ.లక్ష అందజేశారు. నగదును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పరమేశ్వరునికి అన్నాభిషేకం



రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీకామాక్షీ సమేత మూలస్థానేశ్వర ఆలయంలో కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం చందనాభిషేకం, 108 కలశాలతో జలాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా పుష్పాలంకరణ చేశారు. మూలవిరాట్‌కు పండ్లు, వివిధ ఆహార పదార్థాలతో అలంకరించారు. అన్నాభిషేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

అడవి నుంచి జనారణ్యంలోకి వచ్చిన జింక

గుడిపాల: మండలంలోని పాపసముద్రం గ్రామంలో సోమవారం సాయంత్రం ఓ జింక అడవిలో నుంచి తప్పిపోయి జనావాసంలోకి వచ్చింది. వీధికుక్కలు వెంటపడడంతో జింక దారితప్పి గ్రామంలోకి వచ్చేసింది. దీంతో గ్రామస్తులు కుక్కలను తరిమి జింకను పట్టుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకుమారికి సమాచారం అందించారు. గ్రామస్తుల సాయంతో ఆమె అటవీప్రాంతంలో జింకను వదిలేశారు.

- వణికిస్తున్న మిచాంగ్
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నిండి మొరవపోతున్న చెరువులు
- కుశస్థలి నదిలో ఉధృతంగా నీటి ప్రవాహం
- పుత్తూరులో 30 హెక్టార్లలో వరి, వేరుశనగ పంటలు

వర్షార్పణం



తొరూరులో నీట మునిగిన పంట పొలాలు



విజయపురం మండలం పాతార్కాడులో జలమయమైన పంటపొలాలు

నగరి : నగరి నియోజకవర్గం పక్కనే ఉన్న చైన్నెకి సమీపంలో ఉండడంతో తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. మిచాంగ్ తుపాన్ కారణంగా నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా శుక్రవారం వర్షం కురుస్తోంది. ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం 166 మిల్లీమీటర్లుగా నమోదైంది. వర్షపు నీటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు నిండి మొరవపోతున్నాయి. కుశస్థలి నదిలో నీటి ప్రవాహం కనిపించింది. నగరిపేటలో లోతట్టు ప్రాంతంలోని నివాసాల చుట్టూ వర్షపు నీరు చేరింది. రాజీవ్‌నగర్ వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న స్థలమంతా ఏరులా మారింది. స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు పక్కనే ఉన్న గుంట నిండి ప్రవహించడంతో కోర్టు ఆవరణలు జలమయమయ్యాయి. మండలంలోని కృష్ణారామాపురం వద్ద రోడ్డుపై భారీ వృక్షం కూలిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాకపోకలు స్తంభించడంతో అధికారులు అతికష్టం మీద చెట్టును తొలగించి రాకపోకలకు సౌకర్యం కల్పించారు. సత్రవాడ ఎస్టీకాలనీలో నివాసాలకు సమీపంలో ఉన్న గుట్ట పైనుంచి రాతిగుండు దొర్లిపడడంతో సుబ్బమ్మ అనే మహిళకు చెందిన ఇంటిగోడ పాక్షికంగా కూలింది. మండలంలో 7 నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటనా స్థలాలకు చేరుకున్న రెవెన్యూ అధికారులు పరిస్థితిని తెలుసుకుని వారికి సహాయక చర్యలు చేపట్టారు. వేలావడి ఎస్టీ కాలనీకి చుట్టూ నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. తహసీల్దార్, ఆర్డీఓ వారికి సహాయక చర్యలు చేపట్టే అంశంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను సంప్రదించారు. పాండురాజపురం వద్ద రోడ్డుపక్కనే ఉన్న చేనులో బోరుపైపు నుంచి అదంతట అదే నీటిని పైకి ఉబికి వచ్చింది.

నీట మునిగిన పంట

పుత్తూరు: అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడుతాయన్న సమాచారంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక వ్యవసాయాధికారి కోదండయ్య, ఆర్బీకే సిబ్బందితో కలిసి పంట పొలాల్లోకి నీరు చేరిన గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఓ మీడియాతో మాట్లాడుతూ వేపగుంట గ్రామంలో వరి పంట, గంగమాంబాపురం, గోపాలకృష్ణాపురం గ్రామాల్లో వేరుశనగ, నేసనూరులో వరి, వేరుశనగ పంటలు నీట మునిగినట్లు తెలిపారు. మొత్తం మీద 15 హెక్టార్లలో వరి, 15 హెక్టార్లలో వేరుశనగ పంట నీట మునిగినట్లు వివరించారు. రెండు హెక్టార్ల వరకు కూరగాయల పంటలు నీట మునిగినట్లు తెలిపారు. నీట మునిగిన పంటలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు వెల్లడించారు.

23 ఎకరాల్లో నీట మునిగిన వరి, వేరుశనగ

నగరి మండలంలోని ఎం.కొత్తూరులో 6 ఎకరాలు, అగరంలో 5 ఎకరాలలో వేరుశనగ నీట మునిగింది. అలాగే గుండ్రాజుకుప్పం, బీరకుప్పం, కీళపట్టు ప్రాంతాల్లో 12 ఎకరాల మేర వరిపంట నీటమునిగిపోయింది. వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ సోమవారం నీట మునిగిన పంటలను పరిశీలించారు. వరిలో గింజ గట్టి పడి కోతకు సిద్ధంగా ఉంటే సత్వరమే కంబైండ్ హార్వెస్టర్‌ను ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో ఆరబెట్టాలన్నారు. వరి పంట కోసి కంకులు చేనులో ఉంటే తక్షణమే పనలను కట్టలు కట్టి కుప్పలు పోసి టార్పాలిన్‌తో కప్పాలన్నారు. వరి కంకులు తడిచిపోతే వర్షం నిలిచిన అనంతరం మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. రైతులు ఆర్బీకేలను సంప్రదించి పంట నష్టం వివరాలను తెలిపి పాసుపుస్తకం అందించాలని కోరారు. రైతులు అత్యవసర పరిస్థితుల్లో 8331057807 నంబరులో సంప్రదించాలన్నారు.



కృష్ణారామాపురంలో రోడ్డుపైన పడి ఉన్న చెట్టు



రాతిగుండు పడడంతో దెబ్బతిన్న ఇల్లు



నిండిన మాంగాడు చెరువు

బాధిత ప్రాంతాల పరిశీలన



కూలిన ఇంటిగోడను పరిశీలిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి



చింతలపట్టెడ లింగీసుగుంట కట్టపై పరిస్థితి ఆరాతీస్తున్న మంత్రి సోదరులు, మున్సిపల్ చైర్మన్

నగరి : మండలంలో తుపాను బాధిత ప్రాంతాలను మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి సోమవారం పరిశీలించారు. సత్రవాడలో రాతిగుండు పడి గోడ విరిగిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు అధైర్య పడవద్దని, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. చింతలపట్టెడ లింగీసుగుంట కట్టలో నివాసాల వద్ద పర్యటించిన ఆయన అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వర్షాలకు మరింత ప్రవాహం వస్తే నివాసితులను పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా ఎప్పటికప్పుడు తుపాను ప్రభావంపై సమీక్షిస్తున్నారని తెలిపారు. సహాయక చర్యల్లో ముందుండాలని ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు సూచించారన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి బాధితులను అక్కడకు తరలించే ఏర్పాట్లు చేశారన్నారు. తుపాను బాధితులను ప్రభుత్వం ద్వారా, రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్ అమర్, డీఈ నరేష్, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్

శ్రీకాళహస్తి: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఏడు గంగమ్మల జాతర ఏర్పాట్లను సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న ఏడుగంగమ్మల ఆలయం వద్ద ఆయన మాట్లాడారు. ఏడుగంగమ్మల జాతర బుధవారం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ, రంగవల్లులు, శానిటేషన్ వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఘంటసాల గానం, స్వరం అజరామరం అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని తిరుపతి ఫిలిం సొసైటీ, రాయలసీమ రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వీవీ మహల్ రోడ్డు సర్కిల్లోని ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై ఘంటసాలకు నివాళులు సమర్పించారు. తిరుపతి ఫిలిం సొసైటీ కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన శ్రీనివాస సేతుపై ఉదయం వేళ శ్రీవారి కోసం ఘంటసాల ఆలపించిన సుప్రభాతం గీతాన్ని వినిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి ఫిలిం సొసైటీ కోశాధికారి ప్రసాద్‌రావు, సభ్యులు ఆర్.సుబ్రమణ్యం, భాస్కర్, అనసూయమ్మ, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు. ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకొని ఘంటసాల గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణముఖి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి/ఏర్పేడు: తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణం, ఏర్పేడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్వర్ణముఖి నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు తాగునీరు, ఆహారంతో పాటు వసతి సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే ఏర్పేడు మండలంలోని కొత్తవీరాపురం కాజ్‌వేను పరిశీలించారు. తుపాను ప్రభావంతో కాజ్‌వేలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. కాజ్‌వేల వద్ద పోలీసుల గస్తీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా తక్షణమే డయల్ 100, 112, 8099999977 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు గిరిధర్, భవ్య కిషోర్, భీమారావు ఉన్నారు.

చందనాలంకరణలో సర్వేశ్వరుడు



అలంకరణలో శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారు

చంద్రగిరి: కార్తీక మాసం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండల పరిధిలోని తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారిని చందనం అలంకరణలో సుందరంగా అలంకరించారు. భక్తులు ఉదయం ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్తీక దీపాలతో భక్తుల సందడి

భాకరాపేట: కార్తీక మాసం పురస్కరించుకుని కార్తీక సోమవారం చిన్నగొట్టిగల్లులోని శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో దీపాలతో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం నుంచి ఆలయ మూల విరాట్ నుంచి ధ్వజ స్తంభంపై కార్తీక దీపం వరకు దీపాలు పెద్ద ఎత్తున వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమావాస్య నోములు

దీపావళి అమావాస్య నోములు నోముకొనే భక్తులు సోమవారం ఉదయం నుండి పెద్ద ఎత్తున ఆలయంలో నోములు నోచుకుని నోము దారాన్ని ధరించి మొక్కులు చెల్లించుకున్నారు.



నోములు నోచుకుంటున్న భక్తులు

కలకళలాడుతున్న కృష్ణాపురం జలాశయం



వెంగళరాజుకుప్పంలో రోడ్డుపై పొంగిపోతున్న వర్షపు నీరు

కార్వేటినగరం: మిచాంగ్ తుపాన్ కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న మోస్తారు నుంచి భారీ వర్షాలకు కుశస్థలీ నదిపై నిర్మాణం చేపట్టిన కృష్ణాపురం జలాశయం నీటితో కలకళలాడుతోంది. అధికారులు జలాశయం వద్ద పర్యవేక్షిస్తున్నట్లు ఇరిగేషన్ రవీంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 128 ఎంసీఎఫ్‌టీ నీరు చేరిందని, తుపాన్ ప్రభావం ఇలాగే కొనసాగితే త్వరలో పూర్తి స్థాయిలో జలాశయం నిండే అవకాశం ఉందన్నారు. జలాశయాన్ని సందర్శించేందుకు యాత్రికులు ఎవరూ రావొద్దని సూచించారు. గంట గంటకు పెరుగుతున్న నీటి మట్టాన్ని పరిశీలించి మంగళవారం గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజు కుప్పం పాత చెరువు నీటితో కళకళలాడుతోంది. శ్రీకావేరిరాజుపురం కొత్త చెరువు మొరవ పోతోంది. అధికారులు గ్రామాల్లో పర్యటించి చెరువులు, వంకలు, కాలువల వద్దకు ఎవరూ వెళ్లొద్దని సూచించారు.



పాలసముద్రంలో జోరు వర్షం

పొంగిపొర్లుతున్న వాగులు

శ్రీరంగరాజపురం : తుపాను ధాటికి మండలంలోని వాగులు, వంకలు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన కుశస్థలి నది, పాపిరెడ్డిపల్లి, పాతపాల్యం వాగులను సందర్శించి కాలువలకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, సహాయం కోసం 9491077028, 9440900692 నంబర్లలో సంప్రదించాలని కోరారు.





పాలసముద్రం: నిండిన వెంగళరాజుకుప్పం చెరువు, పొంగి పొర్లుతున్న వాగులు

నిండ్రలో..



నిండిన ఎలకాటూరు చెరువు

నిండ్ర: మండలంలోని అరూరు, అత్తూరు, ఎలకాటూరు, చవరంబాకం, ఇరుగువాయి చెరువులు నీటితో నిండాయి. ఎలకాటూరు చెరువు కలుజు పారడంతో పాలమంగళం-ఎలకాటూరు రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా అత్తూరు, అగరం, నిండ్ర కాటేరి చెరువు పూర్తిగా నిండిపోయింది. అధికారులు చెరువులను పరిశీలించారు.

విద్యుత్ తీగలకు మరమ్మతులు

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్రీరామాపురం, కావునూరు, నిండ్ర, అగరం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

చెరువుల వైపు వెళ్లొద్దు

కార్వేటినగరం: మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం సీఐ సత్యబాబు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు చెరువులు, వాగులు, వంకల వైపు వెళ్లొద్దని సూచించారు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసేందుకు గంట ముందే సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా జన సంచారం తగ్గుముఖం పట్టడంతో రాత్రి సమయంలోనే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని సూచించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. లోతట్టు గ్రామాల్లో ఉన్న ప్రజలు కూడా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

పశు శరీర నిర్మాణ శాస్త్రంపై జాతీయ సదస్సు



మీడియాతో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పశు శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జాతీయ సదస్సు జరగనున్నట్టు ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీ అధికారులతో కలసి మీడియాతో మాట్లాడుతూ పశువుల పెంపకంలో ఆధునిక పద్ధతుల వినియోగం, ఆరోగ్యం, ఉత్పాదకత అను అంశాలపై మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పశు నిర్మాణ శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరవుతారన్నారు. వర్సిటీ వీసీ, స్విమ్స్ డైరెక్టర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

రక్షణ కల్పించండి



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమజంట

చిత్తూరు రూరల్: కులాంతర వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని వెదురుకుప్పం మండలం వెంకటరెడ్డి గ్రామానికి చెందిన నందిని, సాయికుమార్ కోరారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తాము ఇష్టపూర్వకంగా గత నెల పెళ్లి చేసుకున్నామన్నారు. ఇంట్లో పెద్దలకు తెలియకుండా ఇన్నాళ్ల పాటు దూరంగా ఉన్నామని తెలిపారు. పెళ్లి విషయం ఇంట్లో తెలియడంతో తమకు పెద్దల నుంచి ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవులు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవులు

తిరుచానూరు(చంద్రగిరి): విద్యుత్ షాక్‌కు గురై ఆవులు మృతి చెందిన ఘటన తిరుచానూరు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి సమీపంలోని అన్నదాన సత్రం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రెండు ఆవులు వెళ్లాయి. అక్కడున్న చెత్తను మేసే క్రమంలో ఆవులకు ఎర్త్ వైరు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ శాఖ గురై అక్కడే కుప్పకూలిపోయాయి. కాసేపటికి గమనించిన స్థానికులు చూడగా అప్పటికే చెందినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.